# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

## ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, జూన్ 14: ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఆర్‌డీ), జనహిత ఫౌండేసన్, కిమ్స్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో వాతావరణంలో వచ్చే మార్పులతో వచ్చే వ్యాధులతో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. అనారోగ్య సమస్యలు ఎదురైన వెంటనే డాక్టర్లను సంప్రదించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేటర్ వైద్య సంస్థలు సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు అందించే వైద్య సేవలను మురికివాడల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో దాదాపు 200 మందికి బీపీ, షుగర్, గైనిక్, ఆర్థోపెడిక్, కంటిపరీక్షలు, న్యూరో తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌డీ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కోఆర్డినేటర్లు శివరాణి, ఇందిరాభారతి, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, నాయకులు ప్రవీణ్, కల్యాణ్, కృష్ణ, అజిపాషా, షకీల్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, సభ్యులు గోవిందరాజ్, గోపాల్, గంగాదేవి, నర్సింగరావు, రాములు, స్వరూప, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభించి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

## వైభవంగా ముగిసిన రాజరాజేశ్వరదేవి ఆలయ వార్షికోత్సవం

మారేడ్‌పల్లి, జూన్ 14: మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం 19వ వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా ముగిశాయి. పుష్పగిరి శంకర భారతీ మహా స్వామి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. శాంతిహోమం, మండప దేవతల హోమాలు, మహాపూర్ణాహుతి, వేదపండితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్త వీరలక్ష్మి , ఎస్ఎస్ కుమారి, ప్రభావతి, లలితా పారాయణ సత్సంగ్ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## మంత్రి వివేక్‌కు సన్మానం

బేగంపేట్, జూన్ 14: కార్మిక, గనులు, ఉపాధి శిక్షణ, ఫ్యాక్టరీస్ శాఖల మంత్రిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జి. వివేక్‌ను బేగంపేటకు చెందిన దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పుడి నవీన్‌కుమార్, ఇతర ప్రతినిధులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ముప్పిడి నవీన్ కుమార్ మాట్లాడుతూ .. దళిత నేతలకు మంత్రి పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. దళితులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని మంత్రి వివేక్ హామీ ఇచ్చారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బట్టు నవీన్ కుమార్, రమేశ్, తదితరులున్నారు.

## ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సభకు హాజరు కండి..

మంత్రి పొన్నంప్రభాకర్‌కు ఆహ్వానపత్రం అందజేసి సన్మానిస్తున్న సంఘం నాయకులు

సికింద్రాబాద్, జూన్ 14: చిక్కడపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 24 న నిర్వహించే ఆర్టీసీ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ శనివారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆర్టీసీ ఉద్యోగుల బీసీ సంఘం నాయకులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సికింద్రాబాద్ రీజియన్ గౌరవ అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఈ సభకు రాష్ట్రంలోని బీసీ ఉద్యోగులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం, బీసీల ఆరాధ్య దైవం అయినటువంటి జ్యోతి రావు పూలే జయంతి ఉత్సవాలను ఆర్టీసీ యాజమాన్యం తరపున ఘనంగా నిర్వహించడం లాంటి పలు అంశాలను ఈ సమావేశంలో చర్చిస్తామని పవన్ కుమార్ గౌడ్ వివరించారు. మంత్రిని కలిసిన వారిలో ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి నిరంజన్, కృష్ణ, వర్క్‌షాప్ కృష్ణ, వెంకటయ్య, సీవీ రావు, సంపత్ పాండు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి:ఎమ్మెల్యే

మల్లాపూర్, జూన్ 14: అభివృద్ధి పనులోల నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మీనానగర్ కాలనీలో రూ.3.5 లక్షలతో బ్రహ్మపురి కాలనీలో రూ.17 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు స్థానిక కార్పొరేటర్ దేవేందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

## బీఆర్ఎస్ పటిష్టతకు ప్రతి నాయకుడు కృషి చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాకేశ్ కుమార్

చిక్కడపల్లి, జూన్ 14: ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆదేశాల మేరకు శనివారం బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ముడారపు రాకేశ్ కుమార్ అధ్యక్షతన గాంధీనగర్ డివిజన్లోని పార్టీ కార్యాలయంలో పార్టీ డివిజన్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. డివిజన్లో పార్టీ మరింత పటిష్టతకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని రాకేశ్‌కుమార్ అన్నారు. ఈ సమావేశంలో నాయకులు ముఠా నరేశ్, పున్న సత్యనారాయణ, పాశం రవి, కుమారస్వామి, ముఠా శివ సింహ, రచ్చ నరేశ్, పుట్ట నవీన్ యాదవ్, వెంకటేశ్, దేవయ్య, రాజ్‌కుమార్, ఈ విట్టల్, యాదగిరి, హనుమంతు, ఎండీ గౌస్, సుధాకర్, కృష్ణ ప్రసాద్, కిరణ్ కుమార్, ఆనంద్‌కుమార్, రాము, పాండు నాయక్, సంతోశ్, నర్సయ్య, ఎల్లయ్య, గోవర్ధన్, సాయి యాదవ్, రెహమాన్ పాల్గొన్నారు..

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

రామంతాపూర్, జూన్ 14: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం డాన్స్ టీచర్ శ్రావణి ప్రియా శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో మహాగణపతి, కొలువైతివా రంగా సాయి, చక్కని తల్లికి, మాధవ కేశవా, జతిస్వరం, మండూక శబ్దం, రామాయణం నృత్య రూపకం అంశాలను దివ్య, రిషిక, జష్మిత, కార్తీక, మా న్విత, సాయి చంద్రప్రియా, అభిరామి, షార్వి, సాయి ప్రగతి , అన్విత, సరితా, చరన్వి, నైతిక రెడ్డి, అశ్విని, శ్రీవల్లి, సాయి కీర్తన, సాయి సహస్ర , శ్రీ సంజన తదితరులు ప్రదర్శించి ఆహుతులను మెప్పించారు.

బాధితురాలికి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్

## సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట్ జూన్ 14: ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా మెరుగైన వైద్యం అందుతుందని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో బేగంపేట డివిజన్, భగవంతాపూర్‌కు చెందిన గౌతమికి చికిత్స కోసం మంజూరైన 2.50 లక్షల రూపాయల ఆర్థిక మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. గౌతమి తండ్రి.. కూతురు చికిత్సకు సహాయం కోసం ఎమ్మెల్యేను ఆశ్రయించారు. ఎమ్మెల్యే చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు కాగా.. ఆ పత్రాన్ని ఆమె తల్లికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## చిన్నారులకు అక్షరాభ్యాసం..

చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, జూన్ 14: గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో వేసవి సెలవుల అనంతరం మొదలైన అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్తగా చేరిన చిన్నారులకు శనివారం అమ్మ ఒడి, అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ పావనీ కుమార్ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు విద్యతో పాటు ఆటలు, పాటలు, నేర్పడమే కాకుండా ప్రతిరోజూ పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. పౌష్టికాహారంలో నాణ్యత పాటించాలన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వినయ్ కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు వై. నర్సమ్మ, డి.ప్రమీల, కౌసర్ బేగం, సభిత, ఆయా మాణిక్యమ్మ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి

## స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి

బన్సీలాల్‌పేట్, జూన్ 14 : రక్తదానం చేయడంవల్ల మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని, స్వచ్ఛందంగా రక్తదానం కోసం ముందుకు వచ్చిన దాతలు అభినందనీయులని గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి అన్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా శనివారం గాంధీ దవాఖానలోని బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లను, రిస్ట్ బ్యాండ్‌లను ఆమె అందజేసి అభినందించారు. నిరుపేద రోగులు అధికంగా వచ్చే గాంధీ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సరిత, ఆర్ఎంఓలు డాక్టర్ రజినీ, డాక్టర్ నజీమ్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది శ్రవణ్ కుమార్, ఫరీదుద్దీన్, దేవేందర్, సునీత, మన్సూర్, బాబా, ఖాజా, వెంకటేశ్‌నాయక్ పాల్గొన్నారు.

## బొల్లారం కంటోన్మెంట్ దవాఖానలో రక్తదాన శిబిరం



రక్త దానం చేసిన దాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సూపరింటెండెంట్ రామకృష్ణ

బొల్లారం,జూన్ 14: ప్రాణాపాయంలో ఉన్నవారికి మనం సేవచేసే గొప్ప సాయం ఏదైనా ఉందంటే అది కేవలం రక్తమిచ్చి వారి ప్రాణాలు కాపాడటమే అని బొల్లారం కంటోన్మెంట్ దవాఖాన సూపరింటెండెంట్ రామకృష్ణ అన్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బొల్లారం కంటోన్మెంట్ దవాఖానలో రక్తదాతల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు, కంటోన్మెంట్ సిబ్బంది రక్తదానం చేశారు. సూపరింటెండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ... ప్రాణాపాయ స్థితిలో ఉండి రక్తం కోసం ఎదురుచూసే వారికి స్వచ్ఛందంగా రక్తదానం చేయడం మన మొదటి కర్తవ్యంగా భావించాలని అన్నారు. చాలామంది ప్రమాదాలబారిన పడినప్పుడు సకాలంలో కావలసిన రక్తం లభించకపోవడంతో అనేకమంది ప్రాణాలు సైతం కోల్పోతున్నారని పేర్కొన్నారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సత్యశీల్, జీవన్ సాయి, ప్రతాప్ గౌడ్, విజయ, కృష్ణా రెడ్డి, ల్యాబ్ ఇన్‌చార్జి విఠల్, ల్యాబ్ టెక్నీషియన్ బండి సరస్వతి,ఉదయ్ కుమార్,అమిత్ పాల్గొన్నారు.

## తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ లో అడ్మిషన్లు ప్రారంభం

ఘట్‌కేసర్, జూన్ 14: తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశాలకు మండల స్థాయి సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీధర్ తెలిపారు. ఘట్‌కేసర్ లోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 17న 4వ తరగతి ప్రవేశం కోసం 3వ తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు అర్హులు అని చెప్పారు. ఈ ప్రవేశానికి 2016 సెప్టెంబర్ 1నుంచి 2017 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బోనఫైడ్ సర్టిఫికెట్, 3 వ తరగతి పోగ్రెస్ కార్డ్, 5 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో ఉదయం 9.30 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ఘట్‌కేసర్‌లో సంప్రదించాలని కోరారు. వివరాలకు శ్రీరాములు సెల్ నంబర్ 96405 01084 ను సంప్రదించాలన్నారు.

## ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత ..

చిక్కడపల్లి, జూన్ 14: ప్రకృతిని కాపాడుకోవటం మన అందరి బాధ్యత అని సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది శ్రీధర్ పోతారాజు అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాలలో పర్యావరణ చట్టాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది శ్రీధర్ పోతరాజు హాజరై మాట్లాడారు. ప్రకృతి గురించి అందులో ఉండే సున్నితమైన విషయాల గురించి వివరిస్తూ ప్రస్తుతం మారుతున్న జీవనశైలితో పర్యావరణంలో జరుగుతున్న విపరీత పరిణామాల గురించి, చట్టాల గురించి వివరించారు. భావి న్యాయవాదులు పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన

చర్లపల్లి, జూన్ 14: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యం లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. ఎన్.శ్రీదేవి ప్రారంభించారు. జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 19బెంచీలు ఏర్పా టు చేసి క్రిమినల్ కేసులు, మోటర్ ప్రమాద కేసులు, గృహ హింస, చెక్‌బౌన్స్ కేసులు, బ్యాం క్, ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించారు. క్రిమినల్ కేసులు 525, లక్ష ఎనబై వేల ఐదు వందల యాబై ఒకటి అన్ని రకాల క్రీమినల్ కేసులు, 35ప్రీటిగేషన్ కేసులను పరిష్కరించారు. ఈ సందర్భం గా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి డి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కక్షిదారుల కేసు ల సత్వర పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌కు అనూహ్యస్పం దన వచ్చిందని, జిల్లా వ్యాప్తంగా 19బెంచీలను ఏర్పాటు చేసి కేసులను పరిష్కరించామని ఆయన తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

## భోలక్‌పూర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి దీన్‌దయాల్‌రెడ్డి

సమావేశంలో పాల్గొన్న భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు

కవాడిగూడ, జూన్ 14 : నిరంతరం ప్రజల మధ్యన ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి దీన్‌దయాల్‌రెడ్డి అన్నారు. భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు అధ్యక్షతన డివిజన్ పార్టీ కార్యాలయంలో జరిగిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు తమ తమ బూత్‌స్థాయిలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవాలన్నారు. వాటిని సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి .. సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ప్రజలకు వివరించాలని అన్నారు. అధిష్టానం పిలుపు మేరకు ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆదేశాలతో ప్రతినెలా బూత్‌స్థాయిలో విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తూ డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. అనంతరం అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన ప్రయాణికులకు సంతాపం తెలియజేయడంతోపాటు వారి కు టుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, కార్యదర్శి గోవిందరాజ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు మకూత్బల్, నాయకులు ప్రవీణ్‌కుమార్, కల్యాణ్, కృష్ణ, హాజీబాషా, మహేశ్ పాల్గొన్నారు.

## మూలం సంతను ఆదరించాలి : లింగం శ్రీధర్

మూలం సంత ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న లింగం శ్రీధర్

అడ్డగుట్ట, జూన్ 14 : పకృతి గ్రామీణ ఉత్పత్తుల సమహారమే మూలం సంత అని తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ అన్నారు. గ్రామ భారతి, సీఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెట్టుగూడ విజయపురి కాలనీలోని మర్రి కృష్ణహాల్‌లో శనివారం నిర్వహించిన 12వ మూలం సంతకు విశేష స్పందన లభించింది. దీనిని ప్రారంభించిన అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ... రైతులను ప్రోత్సహించేందుకు ఈ మూలం సంతలో ఏర్పాటుచేసిన గ్రామీణ వ్యవసాయ గోఆధారిత వస్తువులను ప్రజలు ఆదరించాలని కోరారు. ఇందులో ఏర్పాటు చేసినవన్నీ సహజ పద్ధతిలో పండించిన పకృతి ఉత్పత్తులు కూరగాయలు, పండ్లు, చేనేత వస్త్రాలు, మిల్లెట్స్ వంటి ఉత్పత్తులను విక్రయానికి అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ భారతి ఉపాధ్యక్షులు లింగంగౌడ్, రాజమౌళి, సంయుక్త కార్యదర్శి బండి సురేశ్‌గౌడ్, శివకుమార్, కృష్ణారెడ్డి, మూలం సంత కోఆర్డినేటర్ బొమ్మకంటి మల్లేశం, రామారావు పాల్గొన్నారు.

## నేడు ఉచిత యోగా శిబిరం

రామంతాపూర్,జూన్ 14 :ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రామంతాపూర్ నెహ్రూనగర్‌లో కమ్యునిటీహాల్‌లో ఈనెల 15 నుంచి నెల రోజుల ఉచిత యోగా శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నాని యోగాచార్య రవీందర్ తెలిపారు. ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు నిర్వహిస్తామని, వివరాలకు 924622288లో సంప్రదించాలన్నారు.

## 18న వేలం పాట

పోచారం,జూన్14: పోచారం మున్సిపాలిటీ యనంపేట్ శ్రీరంగనాథస్వామి ఆలయంలో పూజా సామగ్రి, కొబ్బరి కాయల విక్రయ వేలం పాటను ఈనెల 18 నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ భాగ్యలక్ష్మి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ వేలంను ఆలయంలో నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 1, 2025నుంచి,జూలై31,2026వరకు కొబ్బరి కాయలు,పూ జా సామగ్రిని విక్రయాలను నిర్వహించుకోవచ్చున్నారు.

## గుంతలమయంగా బాకారం రోడ్డు

### ఇక్కట్లు పడుతున్న వాహనదారులు

గుంతల మయంగా మారిన బాకారం రోడ్డు

ముషీరాబాద్, జూన్ 14: బాకారం– సాగర్‌లాల్ హాస్పిటల్ రోడ్డు గుంతల మయంగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. భారీ గుంతలు, దుమ్ము ధూళితో స్థానికులు అవస్థలు పడుతున్నారు. నెలన్నర క్రితం భారీ పైప్‌లైన్ నిర్మాణం కోసం రోడ్డును తవ్వారు. అనంతరం పైప్‌లైన్ నిర్మాణం పూర్తయ్యాక జలమండలి అధికారులు మట్టి చదును చేశారు. ఆ తర్వాత జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు నెల రోజుల క్రితం రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించారు. అప్పటినుంచి నిధులు మంజూరు అవుతాయని, పనులు చేపడతామంటూ కాలం వెళ్లదీస్తున్నారు. నిధులు మంజూరు గాక.. రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ గుంతలు, మట్టి కుప్పలు ఉండడంతో రాకపోకలు సాగించడం కష్టతరంగా మారుతుంది. దాదాపు అర కిలోమీటర్ దూరం రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ఈ రోడ్డున వెళ్లాలంటే జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## విమాన ప్రమాద బాధితులకు కొవ్వొత్తులతో నివాళి

కవాడిగూడ, జూన్ 14: అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదంలో ప్రయాణికులు తమ విలువైన ప్రాణాలను కోల్పోవడం ఎయిర్ ఇండియా తప్పిదమేనని, దీనికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు అన్నారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మృతిచెందిన ప్రయాణికుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు విజయ్, బుర్ర రాములుగౌడ్, డాక్టర్ అన్సారీ, అఫ్స సలాం, డాక్టర్ సోలోమన్‌రాజులు మాట్లాడుతూ.. ప్రభుత్వరంగ సంస్థగా ఉన్న ఎయిర్ ఇండియాను ప్రైవేట్‌పరం చేయడంతో ఎయిర్ ఇండియాకు ప్రయాణ చార్జీల పెంపుపై ఉన్న శ్రద్ధ ప్రయాణికుల భద్రతపై లేదని మండిపడ్డారు. ప్రయాణికులు వారికి ముఖ్యం కాదని లాభాలే ముఖ్యమని అన్నారు. విమాన ప్రమాదంలో ప్రయాణికులతో పాటు వైద్య విద్యార్థులు అనేక మంది ప్రాణాలు కోల్పోవడం హృదయాలను కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వానికి పరిశ్రమల ప్రైవేటీకరణపై ఉన్న శ్రద్ధ ప్రజలను సురక్షితంగా ఉంచడంలో లేదని విమర్శించారు. గతంలో కేంద్ర రైల్వే శాఖమంత్రిగా లాల్‌బహదూర్ శాస్త్రి ఉన్నప్పుడు రైలు ప్రమాదం సంభవిస్తే అందుకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేసిన నాయన ప్రమాదంపై విచారణ జరిపించి దోషులకు శిక్ష వేయించారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఏ ప్రమాదం జరిగినా మోదీ ప్రభుత్వం తప్పు వేరే వారిపై రుద్దే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విమాన ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విచారణ జరిపించి దోషులకు కఠినంగా శిక్ష వేయించాలని, భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ నాయకులు రాకేశ్ సింగ్, లక్ష్యనాయక్, రహమాన్‌షరీఫ్, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.